PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
RNI NO.TELTEL/2022/83842

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 225 | సంపుటి 4 | ఆదివారం | 03-05-2026 | పేజీలు 4 | వెల 3/-

"రాష్ట్ర అభివృద్ధి రథానికి ఉద్యోగులే చక్రాలని, వారి సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత పాలనలో విస్మరణకు గురై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ఊరటనిస్తూ సీఎం మంగళవారం వరాల జల్లు కురిపించారు. సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈ భేటీ, కేవలం చర్చలకే పరిమితం కాకుండా.. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన గడువులను విధిస్తూ ఒక కార్యాచరణను ప్రకటించే వేదికగా మారింది. పీఆర్ సీ నివేదికపై తక్షణ ఆదేశాల నుంచి, వేల కోట్ల రూపాయల రిటైర్మెంట్ బకాయిల విడుదల వరకు ముఖ్యమంత్రి తీసుకున్న సానుకూల నిర్ణయాలు ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ముఖ్యంగా జూన్ 1 నాటికి ఆరోగ్య భద్రత కార్డులు అందిస్తామన్న హామీతో పాటు, ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలతో ముఖాముఖి భేటీ అవుతానన్న నిర్ణయం ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించే 'ఫ్రెండ్లీ' అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు, ఈ నెల 5న చేపట్ట తలపెట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనలను విరమిస్తున్నట్లు ప్రకటించడంతో గత కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది."

— ప్రభాత గమనం, హైదరాబాద్




2

# ఇది ఫ్రెండ్లీ సర్కార్..



- ఉద్యోగ సంఘాల జేఏసీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- వేతన సవరణ నివేదికను వెంటనే అందించాలని అధికారలకు ఆదేశాలు
- పెండింగ్ లో ఉన్న రూ.6వేల కోట్ల రిటైర్మెంట్ బకాయిలను 100 రోజుల్లోగా చెల్లిస్తామని హామీ
- జూన్ 1వ తేదీ కల్లా రాష్ట్రంలోని ఉద్యోగులందరి ఆరోగ్య భద్రత కార్డులు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే జీతాల చెల్లింపు గాడిలో పడిందని వ్యాఖ్య
- భవిష్యత్తులోనూ ఒకటో తేదీనే వేతనాలు అందుతాయని వెల్లడి
- ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో విప్ ల పాత్ర కీలకం
- చర్చలు సఫలం కావడంతో సామూహిక నిరాహార దీక్షలను విరమించుకుంటున్నట్లు ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రకటన

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మాది భరోసా**



2

# నవ దంపతుల బలవన్మరణం

- కూకట్ పల్లిలో విషాద ఘటన
- మార్చి 8న వివాహం.. మే నెలలో ఆత్మహత్య
- ఉరేసుకున్న భర్త కార్తీక్, విషం తాగి భార్య మంజుల
- కార్యాలయానికి వెళ్లకపోవడంతో వెలుగులోకి ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

## ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ
# ఫీజు గడువు పెంపు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులకు మరియు మార్కుల పెంపు కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ఇంటర్ బోర్డు మరో అవకాశం కల్పించింది. అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును మే 4వ తేదీ (నేడు) సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ₹3,000 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మే 13 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులు పైచదువుల కోసం విద్యా సంవత్సరాన్ని నష్టపోకుండా ఉండేలా బోర్డు త్వరితగతిన ఏర్పాట్లు చేస్తోంది. బోర్డు సెక్రటరీ యోగితా రాణా పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది.

2





2

# రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

- ఉద్యోగులు, సాగునీటి ప్రాజెక్టులపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయాలు!

తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సమావేశం కానుంది. ఈ భేటీపై రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ, వేలాది మంది ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు మరియు ఎన్నికల హామీల్లో భాగంగా కొత్త సంక్షేమ పథకాల అమలుపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. పాలనలో వేగం పెంచుతూనే, ప్రజలకు చేరువయ్యే దిశగా ప్రభుత్వం ఈ సమావేశంలో పలు ప్రజాకర్షక నిర్ణయాలకు శ్రీకారం చుట్టనుంది.

# ఇది 'ఫ్రెండ్లీ' సర్కార్..

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మాది భరోసా
- పీఆర్ సీ నివేదిక తక్షణమే సమర్పించాలని అధికారులకు ఆదేశం
- రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు రూ.6వేల కోట్లు విడుదలకు హామీ
- జూన్ 1నాటికి హెల్త్ కార్డుల పంపిణీ..
- ప్రభుత్వంపై నమ్మకంతో నిరసనలు విరమించిన జేఏసీ
- ప్రభుత్వానికి విప్ లే కళ్లు, చెవులు..
- ఉద్యోగ సంఘాల జేఏసీతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ



హైదరాబాద్, ప్రభాత గమనం:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని, వారి సమస్యలను పరిష్కరించి పాలనలో భాగస్వామ్యం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో సీఎం సుదీర్ఘంగా సమావేశమయ్యారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై ఈ భేటీలో సానుకూల నిర్ణయాలు వెలువడ్డాయి.

### పీఆర్‌సీపై వేగం పెంచాలని ఆదేశం

ఉద్యోగులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (PRC) అంశంపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. పీఆర్‌సీ నివేదికను సిద్ధం చేయడంలో జాప్యం చేయవద్దని, తక్షణమే నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారుల కమిటీని ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకుని, ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన రీతిలో వేతన పెంపుపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### ఆర్థిక బకాయిల చెల్లింపునకు గడువు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై స్పందించిన సీఎం, గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయిన సుమారు ₹6,000 కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ (పెండింగ్ బిల్లులు)ను రాబోయే 100 రోజుల్లోగా చెల్లిస్తామని ప్రకటించారు. దీనివల్ల వేలాది మంది పెన్షనర్లకు ఊరట లభించనుంది. అలాగే, ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు అందేలా ఇప్పటికే తాము ఒక క్రమపద్ధతిని తీసుకువచ్చామని, దీనిని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు.

### జూన్ 1నుంచి నగదు రహిత వైద్యం

ఉద్యోగుల చిరకాల కోరికైన 'ఆరోగ్య భద్రత'పై సీఎం స్పష్టత ఇచ్చారు. జూన్ 1వ తేదీ నాటికి రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ కొత్త డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ప్రైవేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స పొందేందుకు మార్గం సుగమం కానుంది. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం అధికారికంగా సమావేశమై సమస్యలను సమీక్షిస్తుందని సీఎం వెల్లడించారు.

### దీక్షల విరమణ.. సీఎంకు కృతజ్ఞతలు

ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు లభించడంతో, ఈ నెల 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్ట తలపెట్టిన సామూహిక నిరాహార దీక్షలను విరమిస్తున్నట్లు ఉద్యోగ సంఘాల నేతలు మారం జగదీష్, ఏలూరి శ్రీనివాసరావు ప్రకటించారు. సుమారు 13,100 మంది వైద్య విధాన పరిషత్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వారు కొనియాడారు. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సదానందం గౌడ్, రామకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

### విప్‌లతో సీఎం ప్రత్యేక భేటీ

అనంతరం ప్రభుత్వ విప్‌లతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారంలో వారి పాత్రను గుర్తు చేశారు. "ప్రభుత్వానికి విప్‌లే కళ్లు, చెవుల వంటి వారు. మీరు నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి" అని సూచించారు. విప్‌ల సూచనలు వినడానికి, వారి నియోజకవర్గ సమస్యల చర్చకు వారానికి ఒక రోజు తాను ప్రత్యేకంగా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, గత రెండేళ్లలో 67,760 నియామకాలు పూర్తి చేయడమే ఇందుకు సాక్ష్యమని సీఎం ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



# రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

- ఉద్యోగులు, సాగునీటి ప్రాజెక్టులపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయాలు!

హైదరాబాద్, ప్రభాత గమనం:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సమావేశం కానుంది. ఈ భేటీలో ఉద్యోగుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కొత్త సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

### తుమ్మిడిహెట్టి బ్యారేజీపై తుది నిర్ణయం

ఈ సమావేశంలో ప్రధానంగా సాగునీటి రంగానికి సంబంధించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశం చర్చకు రానుంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి, శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదించిన నాలుగు మార్గాలను కేబినెట్ పరిశీలించి, ఒకదానికి ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

### ఉద్యోగులకు ఆర్థిక ఊరట

గత కొద్దిరోజులుగా ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి జరిపిన చర్చల నేపథ్యంలో, కేబినెట్ తీసుకునే నిర్ణయాలపై ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ. 6,000 కోట్ల పెండింగ్ బకాయిలను 100 రోజుల్లో క్లియర్ చేసే కార్యాచరణకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. పెండింగ్‌లో ఉన్న డీఏ (DA)ల విడుదల, ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియపై మంత్రివర్గం చర్చించనుంది. జూన్ 1 నుంచి అమలు చేయదలచిన నగదు రహిత ఆరోగ్య భద్రత కార్డుల (EHS) విధివిధానాలను ఖరారు చేయనున్నారు.

### కొత్త సంక్షేమ పథకాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఇందిరమ్మ బీమా' పథకానికి కేబినెట్ పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. దీంతో పాటు కొత్త ఆసరా పెన్షన్ల మంజూరు, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన ప్రత్యేక కార్యక్రమాలపై కూడా నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంది.

### ఆర్టీసీ విలీనంపై మార్గదర్శకాలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై ఇప్పటికే కార్మిక సంఘాలతో సీఎం చర్చలు జరిపారు. విలీన ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక అంశాలు, గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై ఈ భేటీలో ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు వెల్లడించాయి. గత భేటీలో పీఏసీఎస్ పాలకవర్గాల నియామకం, గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం, నేటి సమావేశంలో మరిన్ని ప్రజాకర్షక నిర్ణయాలతో ముందుకు వెళ్లాలని భావిస్తోంది.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

- మే 4సాయంత్రం వరకు దరఖాస్తులకు అవకాశం
- మే 13నుంచి పరీక్షలు

ప్రభాత గమనం, హైదరాబాద్ :


రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షకు ఫీజు గడువు తేదీని మే 4 వరకు పొడిగించారు. ఇంటర్ మొదటి, రెండో ఏడాది రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు నాలుగో తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఫీజును చెల్లించి దరఖాస్తులు చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. అయితే ఆలస్య రుసుము (లేట్ ఫీజు) కింద రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు : మే 13వ తేదీ నుంచి 21 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. మే 22వ తేదీ నుంచి 25 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. రెగ్యులర్ విద్యార్థులతో పైచదువులకు వెళ్లేందుకు వీలుగా ఇంటర్

అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా త్వరగా నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ యోగితా రాణా ఇటీవలే తెలిపారు. అదేవిధంగా సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపులు ప్రక్రియ ఏప్రిల్ 13 నుంచే మొదలు పెట్టారు. వచ్చే మే 13వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇంటర్ రీకౌంటింగ్, రీ- వెరిఫికేషన్కు ఏప్రిల్ 13వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

### సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ ఇదే :

- అడ్వాన్స్డ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లింపు ఏప్రిల్ 13 నుంచి ప్రారంభం
- మే 13 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ
- మే 22నుంచి 25 వరకు ప్రయోగ పరీక్షలు
- రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ నిర్వహణ
- ఇంటర్ మార్కుల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్కు ఏప్రిల్ 13 నుంచి దరఖాస్తులు
- చివరి తేదీ ఏప్రిల్ 20.

ఇంటర్ ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు : ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం అడ్వాన్స్డ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యేంత వరకు వరకు ఏప్రిల్ 16 ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఆదర్శ పాఠశాలల టీచర్లను ఆదేశించారు.



# రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

హైదరాబాద్, ప్రభాత గమనం:

తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో పన్నుల వసూళ్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత నెల ఏప్రిల్‌లో వస్తు, సేవల పన్ను (GST) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 4,621 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఇది ఏకంగా 35 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. రాష్ట్ర చరిత్రలోనే ఒక నెలలో నమోదైన అత్యధిక జీఎస్టీ వసూళ్లు ఇవే కావడం గమనార్హం. ఈ భారీ వృద్ధిరేటుతో దేశవ్యాప్తంగా తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది.

### రాష్ట్రానికి రెండో స్థానం

జీఎస్టీ వసూళ్లలో కర్ణాటక 14.5 శాతం వృద్ధితో మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ 12.6 శాతం (CGST, IGST, SGST కలిపి) వృద్ధిని సాధించి దేశంలోనే రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఏప్రిల్‌లో రాష్ట్రానికి మొత్తం మీద అన్ని విభాగాల ద్వారా రూ. 7,181 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. పెట్రోల్, మద్యంపై వచ్చే వ్యాట్ (VAT), వృత్తి పన్నును కూడా కలుపుకుంటే మొత్తం ఆదాయం రూ. 7,570 కోట్లకు చేరింది.

### దేశవ్యాప్తంగా పెరిగిన వసూళ్లు

కేవలం తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా జీఎస్టీ వసూళ్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఏప్రిల్ నెలకు గానూ దేశవ్యాప్తంగా రూ. 2.43 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. ఇది గతేడాదితో పోలిస్తే 8.7 శాతం ఎక్కువ. అంతర్జాతీయంగా అనిశ్చితి ఉన్నప్పటికీ, దేశీయంగా విక్రయాలు పెరగడం మరియు దిగుమతుల ద్వారా వచ్చే పన్ను ఆదాయం మెరుగుపడటమే ఇందుకు ప్రధాన కారణమని కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## వివాహం జరిగిన రెండు నెలలకే
# నవ దంపతుల బలవన్మరణం

- కూకట్ పల్లిలో విషాద ఘటన
- మార్చి 8న వివాహం.. మే నెలలో ఆత్మహత్య
- ఉరేసుకున్న భర్త కార్తీక్, విషం తాగి భార్య మంజుల
- కార్యాలయానికి వెళ్లకపోవడంతో వెలుగులోకి ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రభాత గమనం, హైదరాబాద్ :

హైదరాబాద్ కూకట్‌పల్లిలో నివాసముంటున్న కార్తీక్, మంజులల వివాహం ఈ ఏడాది మార్చి 8వ తేదీన పెద్దల సమక్షంలో ఘనంగా జరిగింది. కార్తీక్ ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, మంజుల గృహిణి. అయితే, బుధవారం ఉదయం కార్తీక్ విధులకు హాజరుకాకపోవడంతో పాటు సహోద్యోగులు చేసిన ఫోన్లకు స్పందించలేదు. అనుమానం వచ్చిన బంధువులు ఇంటికి వెళ్లి చూడగా, ఇద్దరూ అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. వెంటనే వారిని స్థానిక ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

### అన్యోన్యంగా ఉండేవారు - బంధువుల కన్నీరు:

మృతులు ఇద్దరూ చాలా అన్యోన్యంగా ఉండేవారని, అంతలోనే ఇలాంటి కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కావడం లేదని బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా బంధువులతో సాధారణంగానే మాట్లాడారని, ఒక శుభకార్యానికి సంబంధించి ఆహ్వానం అందజేయడానికి వెళ్లినప్పుడు కూడా ఎలాంటి ఇబ్బంది కనిపించలేదని మృతుడి బంధువు ఒకరు తెలిపారు.

### పోలీసుల దర్యాప్తు ప్రారంభం:

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. "మృతుల తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. మరణానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఆర్థిక ఇబ్బందులా లేక వ్యక్తిగత సమస్యలా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం" అని కూకట్‌పల్లి సీఐ సుబ్బారావు తెలిపారు.




# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించాలి

- మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ మే2(ప్రభాత గమనం):

శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ డివిజనల్ అధికారి క్రిష్ణవేణి, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, ఈడబ్ల్యూ ఐసి, సంబంధిత అధికారులతో కలిసి రెండు పడకల గదుల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి అందించాలని అందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. రెండు పడకల గదుల నిర్మాణం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణాలు పూర్తి అయిన వాటిని లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్స్ హౌసింగ్ క్షేత్రస్థాయిలో ఇండ్ల నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి వివిధ దశలవారీగా నిర్మాణంలో ఉన్న ఇండ్ల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు మంజూరు చేయుటకు సిఫారసు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మంజూరు, బిల్లుల వ్యవహారంలో ఎవరైనా లబ్ధిదారుల నుండి డబ్బులు అడిగినా మరి ఇతర ఇబ్బందులకు గురి చేసిన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన సమ్మి గౌడ్

కేసముద్రం మే2(ప్రభాత గమనం):

కేసముద్రం మండలం చంద్రుతండాకు చెందిన బానోత్ కైక- బిక్ష దంపతుల కుమారుడు గణేష్ వివాహం శనివారం నాడు ఘనంగా నిర్వహించారు.ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులకు నూతన పట్టు వస్త్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ వెంట భూక్య శ్రీనివాస్ నాయక్,బానోత్ అశోక్ నాయక్,లకావత్ మనోజ్ కుమార్,మాలోత్ భాస్కర్,భానోత్ రాజు, గూగుల్ లింగా,భూక్య భాస్కర్, చంద్రుతండా యువత తదితరులు పాల్గొన్నారు.




# మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

- జేఎన్టీహెచ్ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్

మహబూబాబాద్, మే.02(ప్రభాత గమనం):

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలువాటు పడి తమ బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని జేఎన్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మహబూబాబాద్ జేఎన్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదక దవ్యాల పై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో మహబూబాబాద్ టౌన్ సిఐ అంజలి, ఎస్సై గడ్డం ఉమ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాల గురించి క్లుప్తంగా వీడియో మాధ్యమాల ద్వారా వివరించి వారికి అవగాహన కల్పించారు. అదే కాకుండా భవిష్యత్తులో ఎలా జీవనాన్ని కొనసాగించాలి పై చదువులకు ఎలా వెళ్లాలి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్ స్టాఫ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్పీని కలిసిన డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి కి డీఎస్పీగా పదోన్నతి లభించిన సందర్భంగా, ఈరోజు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్, ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ రెడ్డి తన సేవా కాలంలో అందించిన మార్గదర్శకానికి ఎస్పీ కి కృతజ్ఞతలు తెలియజేసారు. డా. శబరిష్ మహేందర్ రెడ్డి ని అభినందిస్తూ, కొత్త బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరిచి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. శాఖలో క్రమశిక్షణ, సేవా భావం, ప్రజల పట్ల బాధ్యతతో పనిచేస్తూ ఉన్నత స్థానాలను అధిరోహించడం ప్రతి పోలీస్ అధికారి లక్ష్యంగా ఉండాలని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

- సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలు
- పోలీస్ కమీషనరేట్ పరిధిలో 11 పరీక్ష కేంద్రాలు
- ర్యాలీ లు, ధర్నాలు నిషేధం
- 3న జిరాక్స్ కేంద్రాలు మూత
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ బ్యూరో, ప్రభాతగమనం మే 2 :

నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా సాఫీగా నిర్వహించేందుకు గాను పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిల 11 పరీక్ష కేంద్రాల్లో హన్మకొండ 4, వరంగల్ 2,కాజీపేట 3, జనగామ లలో 2 ఎగ్జామ్ సెంటర్స్ ఉన్నాయన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించ బడుతుందన్నారు.పరీక్ష నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఉండేందుకు గాను ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన్నట్లు తెలిపారు.నీట్ పరీక్ష ముగిసే వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడదరాదని హెచ్చరించారు.సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు పరీక్ష కేంద్రాల చోట నిషేధమని గుర్తు చేశారు. పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు ఈనెల 3న,ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మూసివేయాలని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశించారు. నీట్ పరీక్షల నిర్వహణకై ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు

## ఉమ్మడి వరంగల్‌లో 14 కేంద్రాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో నీట్ ప్రవేశ పరీక్షను పకడ్బంధీగానే కాక పక్కాగా నిర్వహించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకుగాను దేశవ్యాప్తంగా ఈ నెల 3 ఆదివారం రోజున నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్టు (నీట్) అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 14 నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల్లో 6,016మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగనుంది. అభ్యర్థులను ఉదయం 11గంటల నుంచే సెంటర్‌లోకి అనుమతిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటన్నారకు మెయిన్ గేట్లను మూసివేస్తారు. ఆ తరువాత వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోరు. దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు అదనంగా గంట సమయం ఇస్తున్నారు. ఆయా అభ్యర్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష ఉంటుంది. హనుమకొండ, వరంగల్‌లోని పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు స్కైబర్స్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, 4x6 సైజ్ ఫొటో ఒకటి, ఏదైనా గుర్తింపుకార్డు వెంట తీసుకుని రావాలి. పేన్ను, పెన్సిల్ తీసుకురావొద్దు. వీటిని పరీక్ష కేంద్రాల్లోనే అందజేస్తారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకుంటారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు తీసుకురాకూడదు. మహిళలు బంగారు నగలు పెట్టుకొని రాకూడదు. కాళ్లకు షూస్ ధరిం చకూడదు. జీన్స్ లాంటివి గాకుండా సాధారణ దుస్తులు ధరించి రావాలి. పారదర్శకంగా ఉండే వాటర్ బాటిల్స్‌ను తీసుకురావచ్చు. డయాబెటిక్ అభ్యర్థులు పండ్లు (అరటి, యాపిల్) తీసుకొని రావచ్చు.



# పదేళ్ల తాగునీటి సమస్యకు చెక్..

- సొంత ఖర్చుతో నీటి సమస్య పరిష్కరించిన కౌన్సిలర్
- అంగన్వాడి, పాఠశాల పిల్లలకు దాహార్తి తీర్చిన వైనం
- 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవికి కాలనీవాసుల అభినందనలు

కేసముద్రం మే2(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ దాస్ ఉమా రవి శాశ్వత పరిష్కారం చూపించారు. ఎన్నో సంవత్సరాలుగా స్థానిక ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతూ వస్తుండగా, పలువురు నేతలు హామీలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ ఉమా రవి సమస్యను తన భుజాల మీద వేసుకుని, సొంత ఖర్చుతో నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చైతన్య నగర్ కాలనీలోని అంగన్వాడి కేంద్రం మరియు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉండగా, ఈ చర్యతో వారి దాహార్తి తీర్చబడింది. స్థానిక ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు. "గతంలో హామీలే వినిపించాయి, కానీ ఇప్పుడు నిజంగా సమస్య పరిష్కారం అయ్యిందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఏసీపీగా గొర్ల సీతారెడ్డికి పదోన్నతి

- హనుమకొండ ట్రాఫిక్ సేవలతో గుర్తింపు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో



హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓగా 19 నెలల పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించిన గొర్ల సీతారెడ్డి తాజాగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన తన సేవా కాలంలో సహకరించిన అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ పలు అవగాహన కార్యక్రమాలు, నియంత్రణ చర్యలు చేపట్టి ప్రజల నుంచి మంచి స్పందన పొందారు. ఈ విజయానికి కారణమైన ప్రతి వర్గానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, మేధావులు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, గౌరవ సీనియర్ అధికారులు, అలాగే తనతో కలిసి పనిచేసిన పోలీస్ సిబ్బంది అందరి సహకారం వల్లనే తాను ఈ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించగలిగినట్లు పేర్కొన్నారు. తన సేవా కాలంలో అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని, భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో అదే నిబద్ధతతో కొనసాగుతానని గొర్ల సీతారెడ్డి తెలిపారు.

# తొలి మహిళా కమిషనర్‌గా బడుగుల సుమతి

- హైదరాబాద్ పోలీసింగ్ లో సరికొత్త అధ్యాయం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :




హైదరాబాద్ పోలీస్ చరిత్రలో ఒక కీలక మలుపు తిరిగింది. బడుగుల సుమతి ఐపీఎస్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి, ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా నిలిచి చరిత్ర సృష్టించారు. రెండు శతాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ పోలీస్ వ్యవస్థలో మహిళా నాయకత్వానికి ఇది ఒక గొప్ప గుర్తింపుగా భావిస్తున్నారు. ఆమె నియామకం తెలంగాణ పోలీసింగ్‌లో సమానత్వం, ఆధునికత మరియు మానవీయ దృక్పథానికి ప్రతీకగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 2026 ఏప్రిల్ 24న నిర్వహించిన ఐపీఎస్ అధికారుల బదిలీలలో భాగంగా సుమతిని మల్కాజిగిరి కమిషనర్‌గా నియమించింది. ఈ సందర్భంగా పోలీస్ వర్గాల్లో, ప్రజల్లో విస్తృతంగా హర్షం వ్యక్తమవుతోంది. ఆమె ముందు కమిషనర్‌గా ఉన్న అవినాష్ మహంతి స్థానంలో బాధ్యతలు చేపట్టిన సుమతి, అనుభవం, నాయకత్వ లక్షణాలతో ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని అధికారులు విశ్వసిస్తున్నారు. 2006 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన సుమతి, తన సేవా ప్రయాణాన్ని 2001లో గ్రూప్–1 డీఎస్పీగా ప్రారంభించారు. ప్రారంభం నుంచే క్రమశిక్షణ, ప్రజల పట్ల అనురక్తి, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించే నైపుణ్యం ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. వివిధ బాధ్యతలలో పనిచేస్తూ పోలీసింగ్‌లో విశేష అనుభవాన్ని సంపాదించారు. మల్కాజిగిరికి ముందు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి)లో ఐజీగా పనిచేసిన సుమతి, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కీలక పాత్ర పోషించారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడంలో ఆమె చూపిన నైపుణ్యం గణనీయమైన ఫలితాలను ఇచ్చింది. కేవలం రెండు సంవత్సరాల్లోనే 591 మంది మావోయిస్టులు లొంగుబాటుకు ముందుకు రావడానికి ఆమె కృషి ప్రధాన కారణంగా నిలిచింది. ముఖ్యంగా 2026లో ప్రముఖ మావోయిస్టు నాయకుడు తిప్పిరి తిరుపతి (దేవుజి) లొంగుబాటుకు ఆమె చేసిన చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. "యూనిఫాం వెనుక మనిషి" అనే భావనతో నమ్మకాన్ని పెంచుతూ శాంతి స్థాపనలో ఆమె కీలక పాత్ర పోషించారు. టెక్నాలజీ వినియోగంలో కూడా సుమతి ముందంజలో నిలిచారు. మేదారం జాతర సమయంలో భారీ జనసందోహాన్ని నియంత్రించేందుకు ఎఐ ఆధారిత డ్రోన్ టెక్నాలజీ (టీజీ క్యూస్ట్)ను వినియోగించడం ద్వారా ఆధునిక పోలీసింగ్‌కు కొత్త దిశ చూపించారు. ఇది పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం ఎంత ముఖ్యమో మరోసారి చాటి చెప్పింది. మహిళా భద్రత విషయంలో కూడా సుమతి ప్రత్యేక దృష్టి పెట్టారు. సీఐడీ మహిళా రక్షణ విభాగంలో డీఐజీగా పనిచేసిన సమయంలో "షీ టీమ్స్" కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసి మహిళల భద్రతకు కట్టుబడి పనిచేశారు. ఆమె తీసుకున్న చర్యలు మహిళల్లో విశ్వాసాన్ని పెంచాయి. సుమతి తన సేవలకు గాను అనేక పురస్కారాలు అందుకున్నారు. 2022లో "విధిష్ట మహిలా పురస్కార్"తో పాటు గణతంత్ర దినోత్సవ సందర్భంగా "పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్" అందుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఇప్పుడామె ముందున్న ప్రధాన సవాలు మల్కాజిగిరి ప్రాంతం. వేగంగా విస్తరిస్తున్న పట్టణం, విభిన్న జనాభా నిర్మాణం, పెరుగుతున్న ట్రాఫిక్, నేర నియంత్రణ వంటి అంశాలు పెద్ద సవాళ్లుగా ఉన్నాయి. అయినప్పటికీ ఆమె అనుభవం, సహనం, ప్రజలతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించే నైపుణ్యం ఈ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తోడ్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. సుమతి నియామకం తెలంగాణ ప్రభుత్వ సమానత్వ దృక్పథానికి, మహిళా సాధికారతకు, ఆధునిక మరియు మానవీయ పోలీసింగ్‌కు ప్రతీకగా నిలిచింది. మహిళలు కూడా ఉన్నత స్థాయిలో నాయకత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించగలరని ఆమె మరోసారి నిరూపించారు.

# మా భూముల్లోకి వస్తే ఊరుకోం

- మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ సర్వేపై అఖిలపక్షం గర్జన

గార్ల, మే 02, (ప్రభాత గమనం) :

మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ పేరుతో ఏజెన్సీ ప్రాంత రైతుల కడుపు కొట్టాలని చూస్తే సహించేది లేదని గార్ల మండల అఖిలపక్ష నేతలు మరియు రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల అనుమతి లేకుండా, ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అధికారులు చేపడుతున్న అక్రమ భూ సర్వేను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం గార్ల మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలపక్ష నేతలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన ఏజెన్సీ గిరిజన చట్టాలను, హక్కులను పాలకులు, అధికారులు తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రాముఖ్యత ఉన్న 'పీసా' (PESA) చట్టాన్ని విస్మరించి, గ్రామసభలు నిర్వహించకుండానే సర్వే చేయడం రాజ్యాంగ విరుద్ధమని వారు పేర్కొన్నారు. "గార్ల మండల రైతులను సాగునీటి విషయంలో దశాబ్దాలుగా మోసం చేస్తున్నారు. ఇప్పుడు మా కడుపు కొట్టి మున్నేరు నీళ్లను పాలేరుకు తరలించేందుకు కాంగ్రెస్ పెద్దలు కుట్రలు చేస్తున్నారు." అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో గ్రామసభలు జరగకపోయినా, జరిగినట్లుగా ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు పంపి గిరిజన రైతులను వంచిస్తున్న అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును న్యాయస్థానాల్లో ఎండగడతామని హెచ్చరించారు.రైతుల ప్రమేయం లేకుండా భూములను కొలవడంపై తీవ్ర అభ్యంతరం.గార్ల మండలానికి అన్యాయం చేస్తూ పాలేరుకు నీటిని తరలించే కుట్రపై ధ్వజం.ప్రభుత్వం దిగిరాకపోతే కోర్టు ద్వారా స్టే తెస్తామని వెల్లడి.ఈ సమావేశంలో అఖిలపక్ష నేతలు కందునూరి శ్రీనివాస్, జంపాల విశ్వ, కత్తి సత్యం, జంపాల వెంకన్న, గూగులోత్ సక్రు, పానుగంటి రాధాకృష్ణ, శీలంశెట్టి రమేష్, మూడు హరి, బాదావత్ చంటి, సోమ సీతాపతి, ఉపేందర్, మూడు నందు, అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.






# వాణిజ్య గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

- సీపీఐ మండల నాయకుడు మంద భాస్కర్

మహబూబాబాద్, మే2(ప్రభాత గమనం):

శనివారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ అధిక ధరలను అరికట్టవలసిన కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారం మోపుతుందన్నారు. ఈ సంవత్సరం కేవలం ఐదు నెలల లోనే 6 సార్లు గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల అనంతరం వాణిజ్య గ్యాస్ ధరలు పెంచడం వలన హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాళ్లు మూతపడే ప్రమాదం ఉందని దీంతో వాటిపై ఆధారపడ్డ కార్మికులు, యాజమాన్యం జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన ధరల వల్ల హోటల్లు మరియు గ్రామాల్లోని చిన్న హోటల్లు మూతపడ్డాయని అన్నారు. గ్యాస్ ధరల పెంపు వలన టిఫిన్, టీ, భోజనం రేట్లు పెరిగి సామాన్య ప్రజలపై భారం పెరిగి జేబులకు చిల్లు పడుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనేక రాయితీలుస్తూ సామాన్య ప్రజలపై ధరల భారం మోపడం మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగా ఉందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్గొండ వెంకన్న, ఎస్.కె మౌలానా, ఉప్పలయ్య, వెంకన్న, ఎస్ కే జిలాని, పాషా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సెస్సీ ఫలితాల్లో ఈదులపూసపల్లి విద్యార్థుల ప్రతిభ

- సన్మానించిన ఉపాధ్యాయ బృందం

మహబూబాబాద్, మే2(ప్రభాత గమనం):

ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మహబూబాబాద్ మండలంలోని ఈదులపూసపల్లి పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి వీరయ్య ఆధ్వర్యంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అప్రా తబస్సుమ్ 576 మార్కులు, జానకి నందిని 571, సపావత్ ప్రవళిక 546, కన్నెబోయిన సంజన 538 లను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 576 మార్కులు సాధించి, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థిని షేక్ అప్రా తబసుం కు ఐదువేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు .ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఒకటో వార్డ్ కౌన్సిలర్ ధూపటి స్పందన వినయ్ గౌడ్, బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కోట ఎల్లేష్, ఉపసర్పంచ్ బండారు మహేష్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి వీరయ్య మాట్లాడుతూ..జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈదులపూసపల్లి విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో గత నాలుగు సంవత్సరాలుగా మహబూబాబాద్ జిల్లాలో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఎక్కువ మార్కులు సాధిస్తున్నారన్నారు.ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 10 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అంకితభావంతో పనిచేసే అత్యున్నత ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లాంటి సౌకర్యాలు అందిస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించబోతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి పాఠశాల హెచ్ఎం ధరావత్ భద్రు, ఉపాధ్యాయులు గొర్రె శ్రీనివాస్, ఓం ప్రకాష్, కోటయ్య, స్వప్న, నాగరాజు, ఉపేందర్, కుప్పం సూర్యతేజ పాల్గొన్నారు.

# నేలతల్లి ఆరోగ్యంపై దృష్టి సారించండి

- సేంద్రియ సాగుతోనే రైతుకు మేలు
- ముల్కనూర్ రైతు వేదికలో శాస్త్రవేత్త సుహాసిని పిలుపు

గార్ల, మే 2 (ప్రభాత గమనం):


రసాయనిక ఎరువుల విచ్చలవిడి వాడకంతో భూసారం క్షీణిస్తోందని, రైతులు అప్రమత్తమై సేంద్రియ సాగు దిశగా అడుగులు వేయాలని ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త సుహాసిని సూచించారు. శనివారం ముల్కనూర్ రైతు వేదికలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.....పంట దిగుబడి కోసం వాడే మితిమీరిన యూరియా వల్ల నేల సహజత్వాన్ని కోల్పోతుందని, దానికి ప్రత్యామ్నాయంగా వర్మి కంపోస్ట్, పశువుల ఎరువులను వినియోగించాలని కోరారు.చీడపీడల నివారణకు రసాయన మందుల కంటే మొక్కల నూనెలు (వేప నూనె వంటివి) సమర్థవంతంగా పనిచేస్తాయని, ఇవి పర్యావరణానికి కూడా మేలు చేస్తాయని వివరించారు.భూమిని ఆరోగ్యంగా ఉంచుకుంటేనే భావి తరాలకు సారవంతమైన భూమిని అందించగలమని, ప్రతి రైతు సేంద్రియ పద్ధతులను ఒక ఉద్యమంలా చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. "రైతు కేవలం దిగుబడి కోసమే కాకుండా, పండించే పంట నాణ్యతను, నేల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తూ సాగు వ్యయాన్ని తగ్గించుకోవాలి."ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని, శాస్త్రవేత్తలతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



# రైతు సదస్సును విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపు

**మహబూబాబాద్ మే 2(ప్రభాత గమనం):**



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆధ్వర్యంలో మే 6వ తేదీన నిర్వహించనున్న భారీ రైతు సదస్సును విజయవంతం చేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బాణోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు..ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు, రైతులకు భరోసా కల్పించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు, మద్దతు ధర లేక అల్లాడుతున్న అన్నదాతల గళాన్ని వినిపించేందుకు ఈ వేదిక అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.మహబూబాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుండి రైతులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని తెలిపారు.రైతు సమస్యలే ఎజెండాగా, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టడం మరియు రైతు బంధు, రుణమాఫీ వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతు పక్షపాతి అని, మన హక్కుల కోసం కేటీఆర్ నాయకత్వంలో ఐక్యంగా పోరాడాలని శంకర్ నాయక్ కోరారు.ఈ సదస్సు ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు తమ పరిధిలోని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి, వాహన ఏర్పాట్లతో సదస్సుకు హాజరు కావాలని ఆయన సూచించారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

- నలుగురు నిందితులు అరెస్ట్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో**

హసన్ పర్తి మండలం అనంతసాగర్ శివారు ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు పేకాడుతున్నారని నమ్మ దగిన సమాచారం మేరకు హసన్పర్తి ఎస్సై సుజిత్ మరియు తమ సిబ్బందితో కలిసి రైడ్స్ నిర్వహించగా పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది నిందితుల వద్ద నుండి 9750 రూపాయల నగదు నాలుగు మోటార్ సైకిల్ నాలుగు సెల్ ఫోన్లు 104 పేక ముక్కలను స్వాధీన పరచుకోని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది పరారైన ముగ్గురిని త్వరలో పట్టుకుంటామని ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పేకాట రేషన్ బియ్యం గంజాయి పొగాకు లాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టితే ఎంతటి వారైనా ఉపేక్షించి లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుజిత్ హెచ్చరించారు



# 25 మందికి ఎస్సైలుగా పదోన్నతి

- భద్రాది జోన్ పోలీసులకు అవకాశం
- ఎన్నో ఏళ్ళ నిరీక్షణకు మోక్షం
- ఉత్తర్వులు జారీ చేసిన ఇంచార్జి డీఐజీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం, మే 2 :**




ఎన్నో ఏళ్ళ నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో పని చేస్తూ పదోన్నతుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని జోన్-4 భద్రాద్రి జోన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ప్రమోషన్ల ప్రక్రియకు ఎట్టకేలకు మోక్షం లభించింది. హెడ్ కానిస్టేబుళ్లు, అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్లుగా (ఏఎస్ఐ) పనిచేస్తున్న 25 మందికి సబ్-ఇన్స పెక్టర్లుగా (ఎసై-సివిల్) పదోన్నతులు కల్పిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్-4 ఇంచార్జి డీఐజీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30 శాతం కోటా కింద తాత్కాలిక ప్రాతిపదికన ఈ ప్రమోషన్లు కేటాయించారు.వరంగల్, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న వీరికి వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు తదితర ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చారు. పదోన్నతులు పొందిన వారంతా ఉత్తర్వులు అందిన 15 రోజుల్లోగా కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని షరతు విధించారు.ఒకవేళ గడువు లోగా రిపోర్ట్ చేయకపోతే ప్రస్తుత ప్యానెల్ సంవత్సరానికి ఆ ప్రమోషన్ హక్కును పూర్తిగా కోల్పోతారని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రమోషన్స్ ఖాళీల లభ్యత ఆధారంగా కేటాయించారు. పదోన్నతులు పొందిన 25 మందిలో ఈ కింది అధికారులు ఉన్నారు.వరంగల్ పోలీస్ కమీషనరేట్లో ఉన్న కె.కళాధర్ రాజును వరంగల్ కమీషనరేట్ కు,వరంగల్ పోలీస్ కమీషనరేట్లో ఉన్న జి.రామ కృష్ణ చారిని వరంగల్ కమీషనరేట్ కు, వరంగల్ పోలీస్ కమీషనరేట్లో ఉన్న సుదర్శన్ ను మహబూబాబాద్ కు కేటాయించారు. వరంగల్ పోలీస్ కమీషనరేట్లో ఉన్న కె.సుధాకర్ ను వరంగల్ కమిషనరేట్ కు,షేక్ బషీరోద్దీన్ మహబూబాబాద్ కు, పి.తిరుపతిని వరంగల్ కమీషనరేట్ కు,కె.శ్యామ్ సుందర్ ను వరంగల్ కమిషనరేట్ కు,కె.లక్ష్మీ నారాయణ ను వరంగల్ కమిషనరేట్ కు, సయ్యద్ ఉబేద్ ఉల్లా ఖమ్మం కమిషనరేట్ కు , గువ్వ శంకర్ ను వరంగల్ కమిషనరేట్ కు, కె.రమేష్ ను వరంగల్ కమిషనరేట్ కు, కత్తి. రమేష్ ను ఖమ్మం కమీషనరేట్ కు, జి.శ్రీనివాస్ ను ఖమ్మం కమీషనరేట్ కు, టి.సధానందం ను ఖమ్మం కమిషనరేట్ కు, సయ్యద్ సిరాజ్ పాషా ను ఖమ్మం కమిషనరేట్ కు, కాసర్ల రాజయ్యను ఖమ్మం కమిషనరేట్ కు ,కె.రమేష్, కె. రాజమౌళి, ఎస్. ప్రభాకర్, డి.రమాదేవిలని భద్రాది కొత్తగూడెం జిల్లాకు కేటాయించారు. మహబూబాబాద్ లో ఉన్న పున్నం ప్రభాకర్ రెడ్డిని మహబూబాబాద్ కు, పి. చందర్ ను మహబూబాబాద్ నుండి ఖమ్మం కమిషనరేట్ లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంటిలిజెన్స్ లో పని చేస్తున్న ఆర్.గోపాల్ రెడ్డి, ఎన్. కుమార స్వామి, డి.సుదర్శన్ లకు ఎస్సై లుగా ప్రమోషన్స్ కల్పించి ఇంటిలిజెన్స్ విభాగంకే కేటాయించారు. ఒకేసారి 25 మందికి ఎస్సైలుగా ప్రమోషన్స్ లభించడంతో వారి కుటుంబాల్లో ఆనందోత్సవాల్ వెల్లివిరుస్తున్నాయి.



# మహిళల భద్రతపై షీ టీం అవగాహన

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా ఎస్పి డా.. శబరీష్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ షీ టీం కేసముద్రం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో " ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు షీ టీం ఎస్ఐ సునంద ఆధ్వర్యంలో భద్రత గురించి ఉప్పరపల్లి గ్రామం బిచ్చ తండా, సప్పిడి గుట్ట తండా (అమీనాపురం) గ్రామాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మహిళల భద్రత, అలాగే పని ప్రదేశాలలో జరిగే దోపిడీ, వేధింపులు, మోసపూరిత చర్యల గురించి వివరించారు. మహిళలకు వ్యక్తిగత భద్రతా చర్యలు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, మరియు పోలీస్ సహాయం పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళలు తమ హక్కులను తెలుసుకొని, ఎటువంటి వేధింపులు ఎదురైనా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు డయల్ 100/112, మహబూబాబాద్ షీ టీం నెంబర్: 8712656935 మరియు ఇతర అత్యవసర సేవలు సైబర్ టోల్ ఫ్రీ నెంబర్1930పై అవగాహన కల్పించారు.

# ప్రజల వద్దకే ప్రజావాణి

- ఇకపై డివిజన్ స్థాయిలోనూ ఫిర్యాదుల స్వీకరణ
- రేపటి నుంచి ప్రతి సోమవారం ఆర్డీఓ కార్యాలయాల్లో నిర్వహణ
- మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడి



**మహబూబాబాద్, మే 2, (ప్రభాత గమనం) :**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'ప్రజావాణి' పరిధిని విస్తరిస్తూ జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేవలం జిల్లా కేంద్రానికే పరిమితమైన ఈ కార్యక్రమాన్ని, ఇకపై రెవెన్యూ డివిజన్ స్థాయిలోనూ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.వచ్చే సోమవారం (మే 4) నుండి ప్రతి వారం ఉదయం 10:30 గంటలకు మహబూబాబాద్ మరియు తొర్రూరు ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కానుంది. దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి రాలేని సామాన్య ప్రజల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం మరియు తొర్రూరు ఆర్డీఓ కార్యాలయం.ఈ కార్యక్రమాల్లో కేవలం రెవెన్యూ అధికారులే కాకుండా, సంబంధిత డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొంటారు.అర్జీదారులు సమర్పించే ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారికి సకాలంలో రసీదు అందజేయాలని అధికారులను ఆదేశించారు."ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుండి కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా, తమ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయాల్లోనే ఫిర్యాదులు అందజేయవచ్చు. డివిజన్ స్థాయి అధికారులు వీటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం."తమ పరిధిలోని మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక సమస్యలపై నేరుగా అధికారులను కలిసి వినతులు సమర్పించాలని కలెక్టర్ కోరారు.

# మాదకద్రవ్యాలను నిరోదించాలి

- పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, డ్రగ్స్ అనేది గ్రామీణ స్థాయికి చేరిందని, బాల బాలికలు డ్రగ్స్ కు బానిస కాకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందని సమాజంలో డ్రగ్స్ అనేది ఒక పెనుభూతంలా తయారైందని దీని అందరూ అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుని మీద ఉందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మరియు అధికారులు అందరి చేత సీఐ జానకిరామ్ రెడ్డి మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ప్రజా ప్రతినిధులు మరియు అధికారులందరూ తమ తమ స్థాయిలలో డ్రగ్స్ నిరోధించడానికి ప్రయత్నాలు చేయాలని సిఐ జానకిరామ్ రెడ్డి తెలియజేశారు

# మాతృప్రేమకు 'సేవా' నివాళి!

- తల్లి పేరుతో ఆరేళ్లుగా సామాజిక సేవ చేస్తున్న గంజి శ్రీనివాస్ రెడ్డి
- ఇనుగుర్తిలో సేవా శిఖరంగా 'అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్ట్'



**ఇనుగుర్తి, మే 2,( ప్రభాతగమనం) :**

కన్నతల్లి రుణం తీర్చుకోలేనిది. కానీ, ఆ తల్లి జ్ఞాపకాలను పది మందికి మేలు చేసే సేవా కార్యక్రమాల్లో సజీవంగా ఉంచడం కొందరికే సాధ్యమవుతుంది. అటువంటి అరుదైన సామాజిక స్పృహతో ఇనుగుర్తి మండల కేంద్రంలో సేవా జ్యోతిని వెలిగిస్తున్నారు గంజి శ్రీనివాస్ రెడ్డి. తన మాతృమూర్తి గంజి ఉపేంద్రమ్మ అకాల మరణం మిగిల్చిన తీరని లోటును, ఆయన ప్రజా సేవ వైపు మళ్ళించారు. "మాతృదేవోభవ" అనే సూక్తిని కేవలం మాటల్లో కాకుండా, చేతల్లో చూపిస్తూ 2021లో 'అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించి, తన తండ్రి ముకుందా రెడ్డి, సోదరుడు కృష్ణారెడ్డిల ప్రోత్సాహంతో అప్రతిహతంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### కరోనా యోధులకు గౌరవం -విద్యార్థులకు భరోసా

ట్రస్ట్ స్థాపించిన నాటి నుండి నేటి వరకు శ్రీనివాస్ రెడ్డి ప్రయాణం నిరంతరాయంగా సాగుతోంది. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసిన ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలను 'కరోనా వారియర్లు'గా గుర్తించి వారిని సన్మానించడం ఆయన సంస్కారానికి నిదర్శనం. అక్షరజ్ఞానం పట్ల ఉన్న మక్కువతో, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలను అందజేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. ముఖ్యంగా టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, పరీక్షల సమయంలో వారికి పౌష్టికాహారంగా స్నాక్స్ అందిస్తూ అండగా నిలుస్తున్నారు. దేశ రక్షణలో ప్రాణాలు పణంగా పెట్టిన రిటైర్డ్ జవాన్లను సత్కరించడం ద్వారా తన దేశభక్తిని కూడా చాటుకుంటున్నారు.

### స్మృతివనం -పర్యావరణ హితం

శ్రీనివాస్ రెడ్డి ఆలోచనలు కేవలం మానవ సేవకే పరిమితం కాలేదు. ప్రకృతిపై ఉన్న మమకారంతో నెక్కొండ రోడ్డులోని తన వ్యవసాయ క్షేత్రంలో తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించి, ఆ ప్రాంతాన్ని ఒక 'స్మృతివనం'గా తీర్చిదిద్దారు. అక్కడ నాటిన 50కి పైగా మామిడి మొక్కలు నేడు ఫలాలను అందిస్తున్నాయి. ఆ చెట్ల నుండి వచ్చే మామిడి కాయలను విక్రయించకుండా, ప్రతి ఏటా గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేయడం ఆయన ఉదారతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది కూడా సుమారు 3 వేలకు పైగా మామిడికాయలను పంపిణీ చేసి 'ప్రజల మనిషి' అనిపించుకున్నారు.

"తల్లి చెప్పిన బాటలో నడవడం, తోటివారికి సాయపడటమే నిజమైన నివాళి" అని నమ్మే గంజి శ్రీనివాస్ రెడ్డి, భవిష్యత్తులో ఇనుగుర్తి ప్రజల సహకారంతో ఈ ట్రస్ట్ ద్వారా మరిన్ని ఉన్నతమైన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన చేస్తున్న ఈ నిరంతర సేవలు నేటి తరం యువతకు ఆదర్శప్రాయం. సామాజిక బాధ్యతను భుజానికెత్తుకున్న ఇలాంటి వ్యక్తులు ఉన్నంత కాలం ఇనుగుర్తి లాంటి పల్లెలు ప్రగతి పథంలో దూసుకుపోవడం ఖాయం.

# పిల్లలకు మెరుగైన చికిత్స అందించడమే బాల భరోసా లక్ష్యం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్

**మహబూబాబాద్, మే2(ప్రభాత గమనం):**



శనివారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ అధ్యక్షతన ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న "బాల భరోసా" కార్యక్రమం అమలు పై సమగ్రంగా చర్చించారు. ఈ బాల భరోసా కార్యక్రమం 27 ఏప్రిల్ 2026 నుండి ప్రారంభమై, అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవుతున్న ప్రీ-స్కూల్ పిల్లల ఆరోగ్య అభివృద్ధిని మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టబడిందని తెలిపారు. మొదటగా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలను ప్రాథమికంగా పరిశీలించి, అభివృద్ధి లోపాలు ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారని చెప్పారు. అలాంటి పిల్లలను ఆర్‌బీఎస్‌కే బృందాలకు రిఫర్ చేయగా, ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలు మరింత సవివరంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఈ విధంగా చిన్నపిల్లల్లో ఉన్న ఆరోగ్య సమస్యలను తొందరగా గుర్తించి, సమయానికి చికిత్స అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని డా. రవి తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వబడినవి. అన్ని బృందాలు సమన్వయంతో పనిచేసి, అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్య పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ లక్ష్మి నారాయణ, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెచ్ ఈఓ కే ఎల్ యన్ స్వామి, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374